# చిట్టి

శ్రీమతి వి. సుబ్బమ్మ గారు

## ౧

నాకు మువ్వురుపిల్లలు. మొట్టమొదటి సంతానము ఆడపిల్ల. రెండవది కుమారుడు. మూడవది ఆడపిల్ల. ఆపిల్లయే ఆఖరుది. వీరు మువ్వురుగాక యిద్దరు మగపిల్లలు చనిపోయిరి. పిల్లవానిని అందరు "బేబి" యని పిలచెడివారము. చిన్నఅమ్మాయిని "చిట్టి"యని పిల్చెడివారము. బేబియనిన మాకుప్రేమ. ముద్దుకూడాను. బేబిని యతిగారాబముగ పెంచుచుంటిమి. అతడేమో గొప్పవాడయి తీరనియశము నార్జించునని తలచుచుండుదానను. బేబి కిప్పుడు దాదాపు పండ్రెండువత్సరముల వయసు. బడికిపోయి చదువుకొనుచున్నాడు. బేబి కోరికలు ఎప్పటివప్పుడు తీర్చుచుండెడి దానను. నేనేకాదు. మావారు కూడ అంతే. బేబికి జరిగినంత అచ్చటలు ముచ్చటలు ఎవరికిని జరుగలేదు. బహుశా పెద్దఅమ్మాయికి కొద్దిగ జరిగియుండవచ్చును. మాపిల్లలందరు అందగాండ్రే. వారి యందమునకు నేను గర్వపడుచుండుదానను. రోజు దృష్టితీయుచుందును. దృష్టితీయుట ఎవరికి మరచినను బేబికి మరువను. నాకు, (ఎఱుక) సోదె, దృష్టి, జ్యోతిషము, బుడబుడక్కలవాని పలుకులు, కలలు, వీటియందు పిచ్చినమ్మకము. ఈకాలపువారివలె వీటినన్నిటిని త్రోసిపుచ్చెడిదానను కాను.



వి. సుబ్బమ్మ గారు

## ౨

ఒకరోజు మేమందరము నిద్రించుచుండ నే నొక కలగంటిని. బేబియు చిట్టియు జబ్బుతో పరుండియున్నట్లు యాకల కన్పట్టెను. నాటినుండియు నాకు ఒకవిధమయిన భయము పుట్టెను. అల్లారు ముద్దుగ పెంచుచున్న బేబి కేదియో ముప్పువాటిల్లునని దిగులు జెందితిని. కాని చిట్టివిషయమై నేను గమనించనేలేదు. కలగనిన పదిరోజులకు, ఒక ఎరుకత వీధి వెంటబోవుచుండెను. తెల్లగనెరసిన తలమీద ఒకతాటాకు బుట్టపెట్టుకొని "అవ్వో, యవ్వ," యని యఱచుచు, తలవాకిటనుండు నావంకజూచి, నాకు సోదెయందు నమ్మక మున్నదని నాముఖమునుచూచి తెలుసుకొన్నది కాబోలు "సోదె వినవాతల్లి! సోదె చెప్పుదునా యమ్మా!"యని యడిగెను. నేను చెప్పుమని యడిగితిని. వెంటనే యది తన చింపిచాప నేలమీద బఱచి, ఏవియో కొన్నిముగ్గులుగీచి, మూఁడుదోసిళ్ల బియ్యమి య్యమని యడిగి, నేనది ఇవ్వగనే యొక చేటలోపోసి, దానిపై నొక మట్టిప్రమిద దీపము వెలిగించి, ఒకకఱ్ఱ ఆదీపముచుట్టు ముమ్మారుత్రిప్పి, దానికొన నొకదానిని నన్నుపట్టు కొమ్మని, రెండవకొన యది పట్టుకొని, కొంతసేపు కన్నులుమూసి తెఱచి "ఉజ్జయినీ కాళి, కొల్లాపురమ్మ, కొమారసామి, కాటమరాయుడ, కదిరి నరసింహుడ, కనకదుర్గమ్మా వాకీయరే"యని దేవతాప్రార్థనచేసి, పిదప కొన్నిప్రశ్నలకు ఔను కాదని ప్రత్యుత్తరము లిచ్చి, ఆఖరున నేనడుగకనే, లేచివెళ్లబోవునపుడు, నాదగ్గిర రెండుడబ్బులు తీసుకొనుచు "నీకు త్వరలో కడుపుశోకము గలుగు"నని చెప్పిపోయినది. నేనును "అయ్యో! చేతులార తెచ్చుకొంటినే, బేబి చనిపోవునేమోకదా, ఈసోదె ఏలచెప్పించుకొంటిని; దానినేల పిలి చితిని, ఎరుకత తప్పేమి వున్నది. సోదె వినకున్నంతనే, జరుగునది జరుగకపోవునా"యని పలువిధముల చింతించితిని. దుఃఖించితిని. సోదెయందు నమ్మకము లేనివారు నన్నుజూచి నవ్వుదురు. కాని వీటియందు నాకు నమ్మకమని మునుపే చెప్పితినికదా! అప్పుడు నేను కలకును, సోదెకును, ఏదియో సంబంధముండునని ఎంచి దిగులుపడుచుంటిని. వెంటనే నానాథునితో ఈవిషయములుచెప్పి, లేకలేక కలిగిన బేబికి ఏమి కీడుకలుగునోయని కన్నీరు బెట్టుకొంటిని. వారు నన్ను బుజ్జగించి కన్నీరుతుడచి "కలలు, సోదెలు, నిజము లా? భయపడకుము, మనబేబికి వచ్చిన భయమేమియులేద"ని వూరడించిరి. కాని నాకు మాత్రము, మనసులో ఆవేదన లేకపోలేదు.

## 3

నేనుభయపడుచు, కాలము గడుపుచుంటిని. నాభయమునకు కారణము లేకపోలేదని తెల్పుటకో యన్నట్లు మాబేబికి జబ్బుచేసినది. బేబి టైఫాయిడ్‌చే పక్కచేరినాడు. ఇరువదిరోజులు జ్వరము నూటమూడు డిగ్రీలమీదనేకాని క్రిందలేదు. మావారు, చిట్టి, నేను, ముగ్గురము బేబిమంచము దగ్గరే యుండువారము. మాకు నిద్రాహారములులేవు. నాకు స్వప్నము, గోడెయు మరతుమన్నను మరపురాలేదు. బేబి చనిపోవునని యే యనుకొంటిమి. బేబినిచూచిపోవ బందుగు లెందరోవచ్చిరి. వారికి బేబి ముచ్చట్లుచెప్పి, వాని చేతలు, ఉన్నవి, లేనివికూడ వర్ణించి పొగడి యట్టిపిల్లడు నాకు దక్కడాయని కన్నీరు విడచెడిదానను. వారు నన్ను ఓదార్చి బేబికి భయమేమిలేదని ధైర్యముచెప్పి వెళ్లెడివారు. మామాటలు వినినవారు, అమ్మాయిలు బేబియంత తెలివిగలవారు కారని యనుకొనెడివారు నిజానికి చిట్టియే బేబికన్న తెలివిగలది. ఆమె తెలివి మరుగుపడుటకు కారణము, ఆడుపుట్టుక పుట్టుటయే. చుట్టములందఱునువచ్చి బేబిని చూచిపోయిరి. కాని మా పెద్దమ్మాయి యిబ్బందిచేత రాలేకపోయినది. చిట్టికి వయసు ఎనిమిదేయైనను చిట్టికి తెలియనివిషయము లేదు. చిట్టి ముద్దుమాటలచే మమ్ము తనిపింపవలెనని వచ్చినమావారు "చిట్టి, లోనికిపొమ్ము నాకు పనియున్నదని" నేను 'అబ్బా! వూపిరి త్రిప్పుకొన నీయవేమే, తలనొచ్చుచున్నది. పోరకొమ్మని" కసరెడివారము కానీ బేబికి యడ్డేలేదు. అతడుచేసిన తప్పులు పెద్దవయినను మన్నింపబడును. చిట్టివిచిన్నవైనను కొండంతచేసి బేబితో తగువులాడినందుకై తిట్టువారము. ఇవన్నియు, బేబి బాగున్నప్పటి విషయము. అపుడు మాచేతలు మాకు తప్పుగ దోచలేదు. ఇక బేబి జబ్బుగనున్నపుడు చెప్పవలెనా? బేబి జబ్బుగనున్నపుడు ఒకరోజు చిట్టి నాకడకువచ్చి "అమ్మా, జడవేయవా, మూడు రోజులైనదే. బేబి జబ్బుగ నున్నాడని నేనే యడుగుటకూడ మానివేసితిని. ఈపూటయైన వేయవా? నాజతపిల్లలందరు నేను పిచ్చిదానననని ఎగతాళి చేయుచున్నారు."అని యడుగ నేను "నీ అందమున కెక్కడ కొరవపడినది? రేపువేసెదనులే, ఇచట కేకలువేయకుము. బేబి నిద్రపోవుచున్నాడు, వాకిటపోయి యాడుకొమ్మని" కసిరితిని. చిట్టి మారు మాటాడక చిన్నపోయిన ముఖముతో గదివదలి బయటికి పోయినది.

మా పెద్దమ్మాయికూడ బేబినిచూడ రెండురోజులు వీలుచేసికొని వచ్చినది. మరల ఆమె భర్తకడకుపోవుటకు బయలుదేరగనే నేను "అమ్మాయీ, చిట్టిని వెంటగొనిపోమ

దవా? ఇచట అల్లరిచేయుచున్నది. డాక్టరుగారు బేబిని నిశ్శబ్దముగ నుంచవలెననియు, ఎవరును దగ్గరకురాకూడదనియు చెప్పుచున్నారు. చిట్టి కెంతచెప్పినను తెలియదు. నీకిబ్బందిగనున్న వలదుసుమా!" యంటిని. మాఅమ్మాయి బేబికి ఇబ్బందియని విన్నతోడనే బదులుచెప్పక చిట్టిని వెంటకొనిపోవ, చిట్టి ఇష్టము లేకున్నను అక్కగారింటికి వెళ్లెను. బేబి దినదినమునకు శుక్లపక్షచంద్రునివలె ఆరోగ్యము పొందినను డాక్టరు బేబిని చల్లటి ప్రదేశమునకు విశ్రాంతికై కొంపొమ్మని సలహానిచ్చెను. వెంటనే మేమిరువురము బేబిని బెంగుళూరుకు కొంపోతిమి.

## ౪

రాజమహేంద్రవరమున చిట్టికి అక్కగారింట స్ఫోటకము తగిలెను. అమ్మా, అమ్మా యని కలువరించుచుండెను. మాపెద్దమ్మాయియు, మాకు ఉత్తరము వ్రాతునా వలదా యని, యోచించి, యోచించి, తుదకు బేబికి నెమ్మదిగవుండి, బేబిపొమ్మనినవచ్చి చిట్టిని చూచి పోవలసినదని యొక ఉత్తరమువ్రాసెను. అది చేరకముందే యొక తంతివార్త వచ్చెను. 'చిట్టి మిమ్ముచూడవలయునని కలువరించుచున్నది. వ్యాధి హెచ్చుగనున్నది. తక్షణము బయలుదేరుడ'ని మాయల్లుడు పంపెను. బేబిని కదిపిన ఆరోగ్య భంగమగునని మావారిని బేబికడనుంచి నేను చిట్టిని చూడ ప్రయాణమైతిని. చిట్టికేమివ్యాధియో చిట్టిని చూచువరకు నాకు తెలియదు. చిట్టి నన్ను చూడగనే "అమ్మా!"యని పిలచి ఎత్తుకొమ్మని ఏడ్చెను. నేను చిట్టిని యొడిలోనుంచుకొనగనే, కొంతసేపు నన్నుపైచూచి "అమ్మా, బేబికిపుడు జ్వరములేదు కదా! డాక్టర్ నన్నురమ్మనెనా, నేను వచ్చెదను. నన్ను నీతో తీసికొనిపొమ్ము. నీవు బేబిని వదలిపెట్టి రావనుకొంటిని. నాకన్న బేబియే మీకందరికి ఎక్కువయనికూడా ఎరుగుదును. అమ్మా, నాన్న బేబిదగ్గరనున్నాడా? నాన్న, బేబి రాలేదా" యనుచు కనులుమూసికొనెను. మరల తెరువలేదు. చిట్టి తన్ను బేబిని ప్రేమించినట్లు ప్రేమింపలేదని కనుగొనెను. ఇపుడు చిట్టి పసిడి తూగుటూయలలో వూగుచు, చుక్కవలె మెరయుచున్నది. నాటినుండియు నాదుఃఖమునకు మితిలేదు. నాపక్షపాతము ఇపుడు తెలిసినది. చిట్టిమాటలు ఇప్పటికిని నాహృదయ శల్యములై వున్నవి. చిట్టిపలుకులు వాస్తవమే. మాయిరువురికిని యిపుడేదిశిక్ష?